# నగ్న శిఖరాలు



కాటూరు రవీంద్ర-త్రివిక్రమ్

'ఎయిర్ బస్' మెల్లగా 'రన్‌వే' మీద దిగుతోంది.

గులాబీదండలు పుచ్చుకు నిలబడ్డ ఉషా గాయత్రి, కిరీటి, పార్థసారథి మొహాల్లో ఒక్క మాటుగా ఉద్వేగం పెరిగింది.

"ప్లేన్ వచ్చేస్తోంది. మన జయరాం ఇంకా ఊడిపడదేం?" విసుక్కున్నాడు. పార్థసారథి.

"మనవాడికిది మామూలేగా - ఎక్కడి కెళితే అక్కడే!" వ్యంగ్యంగా అన్నాడు కిరీటి.

"ఇంతకీ మన ఎమ్. డి. గారి కారుని విమానందాకా తీసుకెళ్లేందుకు ఎయిర్ పోర్టు అథారిటీ ఒప్పుకున్నారో లేదో...."

సందేహంగా అంది ఉష.

"ఆ సందేహం అక్కర్లేదులే. మన వాడు పట్టుకున్నాడంటే మొసలే," కిరీటి.

"ప్లేన్ టార్ మెక్ మీదకొచ్చేస్తోంది." అన్నాడు పార్థసారథి ఆదుర్దాగా.

అతనా మాటలు అంటుండగానే 'ఎయిర్ బస్' చెవులు హోరెత్తేలా ఇంజన్లు రొదచేసుకుంటూ 'టార్ మెక్' మీద కొచ్చేసింది.

గ్రౌండ్ మార్షలర్, ఎయిర్ బస్ పైలట్‌కి సంకేతాల ద్వారా పొజిషన్ చూపిస్తున్నాడు.

అప్పుడు పరుగులు తీస్తూ వచ్చాడు జయరాం.

"కమాన్ క్విక్" అంటూనే కారు వైపు పరుగెత్తాడు.

మనసులో విసుక్కుంటూనే అతని వెంట పరుగెత్తుకెళ్లి కార్లోకూర్చున్నారు. జపాన్ మేక్ ఎయిర్‌కండిషన్ కారు చిన్న కుదుపుతో ముందుకి కదిలి, పాదరసంలాగా జారుతూ నేరుగా వెళ్లి 'ఎయిర్ బస్'కు సమీపంగా నిలబడింది.

అప్పుడే కిషోర్ ఎడమచేతి మీద కోటు వేసుకుని బయటికొచ్చాడు.

వెంటనే హర్షధ్వానాలు.

కిషోర్ జవాబుగా జయరాం బృందాన్ని నవ్వుమొహంతో చూసి, గాలిలో అభినందన సూచకంగా చెయ్యి కదిలించాడు.

ఒక్కో మెట్టూ దిగి, కారు దగ్గరికి రాగానే గులాబీదండలతో ముంచెత్తారు.

"థాంక్యూ వెరీమచ్" దండలు తీసి, కారులోకెక్కి కూర్చున్నాడు, కిషోర్. అతని ఆదేశంమీద, అతని ప్రక్కనే ఉషాగాయత్రి ఆసీనురాలైంది.

"టికెట్ ఇలా ఇవ్వండి సార్— ఫార్మాలిటీస్ కంప్లీట్ చేయిస్తాను".

జయరాం.

ఇచ్చాడు.

కారు 'రాయంచ'లా వయ్యారంగా ముందుకి కదిలింది.

• • •

"మే ఐ కమిన్ సర్ ?"

"యస్."

"సారీ ఫర్ ది డిలే."

"టేక్ యువర్ సీట్."

"థ్యాంక్యూ సర్."

కిషోర్ ఓ మాటు అందరికేసీ చూశాడు.

అంతా ఉన్నారు !

"సో ఐ విల్ బిగిన్...." —సౌండ్ ప్రూఫ్ ఎ. సి. గదిలో నిశ్శబ్దం మరో మాటు భంగమయింది.

తెరుచుకున్న తలుపులోంచి లోపలి కొచ్చిన ప్యూను జార్జి చేతిలో క్రీమ్ బిస్కెట్ ప్యాకెట్లున్నాయి. పేపరు ప్లేట్లలోకి వాటిని సర్ది, అందరిముందూ ఉంచి, మంచినీళ్ల గ్లాసులు అమర్చాడు. మౌనంగా, కళ్లతోనే కిషోర్ అనుమతి తీసుకుని బయటికి వెళ్లిపోయాడు.

"ఏంచేద్దాం ! కానివ్వండి. ఎదురుగా క్రీమ్ బిస్కెట్లుంటే, నా ఉపన్యాసం రుచి చెడిపోయే ప్రమాదం ఉంది" నవ్వుతూ ఒక బిస్కెట్ అందుకున్నాడు కిషోర్.

మిగతా వాళ్లు కూడా అతన్ననుసరించారు.

ఛలోక్తులు- బిస్కెట్ల తియ్యదనం మంచినీళ్ళ చల్లదనం మధ్య పది నిముషాలు దొర్లాయి.

పదకొండో నిముషంలో కిషోర్ ఉపన్యాసం ఇవ్వటానికి సిద్ధమయ్యాడు.

మళ్లీ డోరు తెరుచుకుంది.

మేనకలా 'మేకప్' చేసుకున్న ఉషా గాయత్రి నవ్వుమొహం !

"యస్ ఉషా...."

"మీకోసం ఎవరో వచ్చారు సార్.."

"అఫీషియల్ ?"

"పర్సనల్ !"

"ఆగమని చెప్పు."

"ఓ. కే. సర్"- వెళ్లిపోయింది.

ఇక కిషోర్ ఆగలేదు.

అతని విదేశీ పర్యటనా విశేషాలు, కంపెనీ అభివృద్ధికి చేయవలసిన మార్పులు, మానేజిమెంట్‌లో సరికొత్త విధానాలు- ఇలా గంటసేపు కొనసాగింది ఉపన్యాసం.

కిరీటి, పార్థసారథి, జయరాం, మరి కొందరు ముఖ్యమయిన ఆఫీసర్లు- అతని ఉపన్యాసాన్ని చివరిదాకా శ్రద్ధగా విన్నారు.

అతను ముగించగానే హర్షాధ్వానాలు మ్రోగాయి.

"ఇప్పుడు మీ సమస్యలు ఏవైనా ఉంటే చెప్పండి...." కుషన్ ఛెయిర్‌లో వెనక్కివాలి, 'రిలీఫ్'గా చూస్తూ అన్నాడు కిషోర్.

తలా ఒకటి చెప్పారు.

అందులో కొన్ని ఆఫీసుకి- మరి కొన్ని వ్యక్తిగతానికి సంబంధించినవి.

ప్రతిదానికీ, వాళ్లు సంతృప్తిపడేలా పరిష్కారాలు సూచించాడు. వ్యక్తిగత సమస్యల్లో కంపెనీ తరఫున అసాధారణమయిన ఉదారత చూపించటం అందరికీ ఆనందం కలిగించింది.

కంపెనీ మానేజింగ్ డైరెక్టరుగా అతనిపట్ల వారికిగల గౌరవాన్ని, అతని ఉదారత్వం, ఔన్నత్యం ద్విగుణీకృతం చేశాయి. ఎక్కడివాళ్లక్కడ వెళ్లిపోయేక, ఏవో ఫైళ్ళు చూసుకుంటూ అక్కడే కూర్చుండిపోయేడు కిషోర్.

కొద్ది నిముషాలు ఏకాంతంలో, గంభీరంగా దొర్లాక- మళ్లీ తలుపు తెరిచిన శబ్దం.

చివ్వున తలెత్తిచూశాడు.

ఉషాగాయత్రి !

"అతన్ని లోపలికి పంపించమంటారా సార్ ?"

కిషోర్‌కి చప్పున గుర్తువచ్చింది, తనకోసం ఎవరో చాలాసేపుగా నిరీక్షిస్తున్నారని. ఆ సంగతే మర్చిపోయేడతను. లేకపోతే, మీటింగు పూర్తయిన వెంటనే పిలిపించి ఉండేవాడు !

తన మతిమరుపుకి మనసులోనే నొచ్చుకుంటూ "ప్లీజ్.." అన్నాడు.

ఉషాగాయత్రి అతన్ని పంపించటానికి వెళ్లింది.

మరోనిముషం గడిచేలోగానే తలుపు తెరుచుకుంది. లోపలికి వచ్చిన వ్యక్తిని వెంటనే గుర్తుపట్టలేక అలాగే చూస్తుండిపోయాడు కిషోర్.

"నేను రఘుని !"

కిషోర్ మాటలురానివాడిలా అలాగే చూస్తుండిపోయాడు.

"నన్ను గుర్తుపట్టలేదనుకుంటాను.."

"లేదు...."


నవ్వేడతను. "చాలాకాలం అయింది కద.... నేను నీకు సవితి తమ్ముణ్ణి...." పరిచయం చేసుకున్నాడు.

ఒక్కమాటు నాలుగువేల వోల్టుల షాక్ తిన్నట్లు అదిరిపడ్డాడు. 'సవితి తమ్ముడు....' తనలో తను గొణుక్కున్నాడు. ఎప్పుడో చిన్నతనంలో చూశాడు.... ఇంత పెద్దవాడుగా ఇదే చూడటం. తననెలా గుర్తుపట్టాడో- కనుక్కొని ఉంటాడు- మెల్లగా వివరాలు సేకరించిఉంటాడు !

"ఏమిటలా అయిపోయావ్ ?"

తేరుకున్నాడు.

"ఏమీలేదు ! ఇప్పుడు నువ్వెందు



కొచ్చావ్ ?" లోలోపల చల్లారిన అగ్ని పర్వతం మళ్లీ రగులుకుంటున్నట్లు బాధ, ఆవేశం పొంగుతున్నాయి.

"పంటలు దెబ్బతిన్నాయి. నాన్నకి పక్షవాతం. అమ్మకి టి. బి. ఆర్థిక పరిస్థితి బాగాలేక తమ్ముళ్లు చదువు మానేసి తలాకపనిలో చేరారు...."

"ఇవన్నీ చెప్పినందువల్ల ఉపయోగం ఏమిటి ?"

"నీ దగ్గర ఏదైనా ఉద్యోగం...."

వ్యంగ్యంగా నవ్వేడు.... "బయట బోర్డు చూళ్లేదా ? నో వెకెన్సీ అవి పెద్ద అక్షరాలతో ఉంటుందే.... బైదిబై.... నువ్వేం చదువుకున్నావ్ ?"

"ప్రైవేటుగా ఎమ్మే ఫస్టుక్లాసులో ప్యాసయ్యాను."

"అయితే నే నివ్వగల ఉద్యోగం నువ్వు చెయ్యలేవు...." గాయపరచాలన్న కౌతుకం కళ్లలో కనుపించింది.

"ఏమిటది ?"

"బంట్రోతు ఉద్యోగం !"- అతను మౌనంగా ఉండిపోయేడు. నిశ్శబ్దాన్ని భంగంచేస్తూ- "మీ అమ్మ నన్ను, నా చెల్లెల్ని పరమరాక్షసంగా హింసించి, ఇంట్లోంచి గెంటినపుడే మన సంబంధాలు తెగిపోయాయి. మీరు నాకు బంధువులవుతారని ఏనాడో మర్చిపోయాను.

ఇంకా నీకు నామీద నమ్మకం ఉండటం నాకే ఆశ్చర్యంగా ఉంది. నేను గాంధీని, గౌతమబుద్ధుణ్ణీ కాదు. అందరూ అలా ఉండగలిగితే, మహాత్ములకి విలువ, గుర్తింపు ఉండవు.... సో.... మీ గొడవేదో మీరు చూసుకోవటం మంచిది."

రఘు నవ్వేడు.

"ఎందుకు నవ్వుతావ్" కోపంగా అడిగేడు కిషోర్.

"దేవుణ్ణి కొండశిఖరంమీద ప్రతిష్ఠిస్తారు. జీవితంలో ఔన్నత్యం అనే శిఖరాన్ని ఎక్కిన నీలో దైవత్వం చూడగలనని నమ్మాను. జీవితం గురించి నేను నీకు వేదాంతం చెప్పదలుచుకోలేదు. కానీ, ఒక్క సంగతి. మనం కొండశిఖరంమీద కూర్చున్నంతసేపూ నేలమీద మనుషులు చీమల్లా కుచించుకుపోయి కనుపిస్తారు. అలా కనిపించటం భ్రమేనని మనం మర్చిపోకూడదు. అలా మర్చిపోకపోతే శిఖరంమీద పువ్వులా పరిమళిస్తాం. లేకపోతే, కురుపులా సమాజానికి బాధ కలిగిస్తాం. వస్తాను. గుడ్ బై !" బాణంలా ముందుకు కదిలివెళ్లాడు రఘు.

ఎప్పుడు తలుపు తెరుచుకు మూసుకుందో కూడా కిషోర్‌కి తెలియదు. అంతరాంతరాలలో మెరుపుకన్నా వేగంగా ప్రయాణించి, మస్తిష్కంలో గిర్రున గింగిరాలు కొట్టి, కర్ణరంధ్రాలలో ప్రతిధ్వనులుగా మిగిలిపోయిన అతని మాటలు- స్తబ్ధుణ్ణిచేశాయి.

వివేకం వేకువలా రేకలు విచ్చుకుంది.

వెంటనే 'కాలింగ్ బజర్' నొక్కాడు.

ప్యూను జార్జి పరుగున వచ్చాడు.

"అతన్ని వెనక్కి పిలు...."

"ఎవర్ని సార్ ?"

"ఫూల్ ....ఇప్పుడు వెళ్లినతన్ని...."

జార్జి హడావిడిగా పరుగుతీసాడు.

నిముషం....

రెండు....మూడు....నాలుగు.... పది ....పదిహేను....

అసహనంగా "కాలింగ్ బజర్" నొక్కాడు.

మళ్లీ–మళ్లీ–మళ్లీ....

ఎప్పటికో వగరుస్తూ వచ్చాడు జార్జి.

"సారీ సర్ .... తను వెనక్కిరానని ఈ కాయితం ఇచ్చాడు...."

కిషోర్ దాన్నందుకుని ఆశ్చర్యంగా విప్పదీసి చూశాడు.

దస్తూరి గజిబిజిగా ఉంది.

"డియర్ బ్రదర్ –

స్వయంగా రావాలనిపించక ఈ ఉత్తరం పంపుతున్నాను. మనవంశంలో నువ్వొక్కడివే శిఖరంమీద దీపశిఖలా వెలిగిపోతున్నందుకు నాన్న ఎప్పుడూ గర్వపడుతుంటాడు. ఆయనతోబాటు మేముకూడా.

కానీ, నిన్ను కలుసుకున్న తొలి క్షణాల్లో- ఆత్మీయత మర్చిపోయి, ఆగ్రహంతో, ఆవేశంతో మాట్లాడిన నిన్ను చూసి "ఇదా నేను ఊహించుకున్న మహోన్నతశిఖర నగ్నస్వరూపం" అని నివ్వెరపోయాను.

అందుకే–నిన్ను చుట్టిముట్టిన భ్రమలు తొలిగిపోవాలని పౌరుషంగా జవాబిచ్చాను. నా ఉద్దేశ్యం ఫలించి నీలో ఈ మాత్రం కదలిక అయినా వచ్చినందుకు ఆనందపడుతున్నాను.నీలో నిజమైన పరివర్తన కలిగితే - అవతల నిన్ను కనీసం కళ్లతోనైనా చూసి తృప్తిపడదామని తపించే నీ రక్తబంధువుల్ని ఆనందపరచు.

నా సంగతి -

ఇప్పటికే "నో వేకెన్సీ" బోర్డులు చూసి చూసి విసిగిపోయాను. అలాటి బాదరబందీలులేని డిపార్టుమెంటు మన రక్షణదళాలు మాత్రమే. అక్కడ సామర్థ్యం తప్ప, మరో అవసరం ఉండదు. ఎవర్నీ "దేహీ" అని దేనికీ యాచించనక్కరలేదు. అదే నాకు తగినచోటుగా నిర్ణయించుకున్నాను.

శలవ్....

–రఘు".

